

వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో ఫిజియోథెరపీ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ కృష్ణ, డాక్టర్ నాగేందర్

ఫిజియోథెరపీ యూనిట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

వనస్థలిపురం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫిజియోథెరపీ యూనిట్‌ను సద్వినియోగం చేసుకోవాలని వనస్థలిపురం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణ అన్నారు. బుధవారం వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫిజియోథెరపీ యూనిట్‌ను డాక్టర్ నాగేందర్‌తో కలిసి సూపరింటెండెంట్ కృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే పేదలు, నిరుపేద రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి నూతనంగా ఫిజియోథెరపీ యూనిట్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. ఆస్పత్రిలో ఫిజియోథెరపీ యూనిట్‌ను ఏర్పాటు చేయడం తమకు సంతోషకరంగా ఉందని, ఈ వైద్య సేవలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వైద్యులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



హయత్‌నగర్ బస్సు టర్మినల్‌లోని ప్రహరీని పరిశీలిస్తున్న ఆర్టీసీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ, జాయింట్ డైరెక్టర్ నర్మద

హయత్‌నగర్ బస్సు టర్మినల్ ప్రహరీ పరిశీలన

హయత్‌నగర్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): జాతీయ రోడ్డు విస్తరణలో భాగంగా హయత్‌నగర్‌లోని బస్సు టర్మినల్ వద్ద గల ప్రహరీ తొలగించాల్సి వస్తుందని ఆర్‌అండ్‌బీ అధికారులు చెప్పడంతో దాన్ని పరిశీలించేందుకు బుధవారం ఆర్టీసీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ, జాయింట్ డైరెక్టర్ నర్మద, ఈడీ రాజశేఖర్‌తో కలిసి వచ్చి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజయవాడ జాతీయ రహదారి విస్తరణలో హయత్‌నగర్ అంబేడ్కర్ విగ్రహం వెనుక ఉన్న ఆర్టీసీ ప్రహరీ సర్వీస్ రోడ్డు పోతుందని ఆర్‌అండ్‌బీ అధికారులు చెప్పడంతో దాన్ని పరిశీలించేందుకు వచ్చినట్లు చెప్పారు. కొంత భాగం రోడ్డులోకి వస్తున్నట్లు గుర్తించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో విజిలెన్స్ సెక్యూరిటీ ఆఫీసర్ సంతోష్‌తో పాటు స్థానిక ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

వరదనీటి కాల్వ నిర్మాణ పనుల పరిశీలన

కొత్తపేట, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల వేళ కాలనీల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని స్థానిక కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. న్యూ సమతాపురికాలనీ, గాయత్రీపురం, ఎస్‌ఆర్ ఎల్‌కాలనీ, నాగేశ్వర్‌రావుకాలనీ, బృందావన్‌కాలనీల్లో అధికారులతో కలిసి పర్యటించారు. న్యూ సమతాపురికాలనీలో కొనసాగుతున్న వరదనీటి కాల్వ నిర్మాణ పనులను ఆయన బుధవారం పరిశీలించారు. పనులను పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. జీహెచ్‌ఎంసీ ఏఈ షరీఫ్, హైడ్రా సిబ్బంది పాల్గొన్నారు.



పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

పార్కుల అభివృద్ధికి కృషి : సుజాతానాయక్

సంతోష్‌నగర్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ పరిధిలోని పార్కులను అభివృద్ధి చేయనున్నట్లు జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ తెలిపారు. డివిజన్ పరిధిలోని భీమానగర్ పార్కులో రూ.22లక్షల అర్బన్ బయోడైవర్సీ నిధులతో పార్కు అభివృద్ధి పనులను బుధవారం కాలనీవాసులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అన్ని పార్కులను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో ప్రతి కాలనీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేష్, నర్సింహారెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.

అన్ని దానాల్లో అవయవదానం గొప్పది



అవయవదానంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కాట్రగడ్డ భారతి

చాదర్‌ఘాట్/సంతోష్‌నగర్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ పారా మెడికల్ ఆఫీసర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం మలక్‌పేట ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు అవయవదానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శరీర అవయవదాతల సంఘం అధ్యక్షురాలు కాట్రగడ్డ భారతి మాట్లాడుతూ మనం చేసే అన్ని దానాల్లో అవయవదానం గొప్పదన్నారు. అవయవదానం అనేక పద్ధతుల్లో చేయవచ్చునన్నారు. మానవ శరీరంలోని అన్ని అవయవాలను దానం చేయవచ్చునని, ప్రతి ఒక్కరూ ఆ దిశగా ఆలోచనలు చేయాలన్నారు. అవయవదానంపై ప్రజల్లో చైతన్యం కల్పించాలని అన్నారు. అవయవదానంలో విద్యార్థుల కు అవగాహన కల్పించడానికి ప్రభుత్వం పాఠ్యాంశంగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌ఎల్‌ఈపీ రిటైర్డ్ పారామెడికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్. సద్గుణాచారి, సంఘం ప్రధాన కార్యదర్శి గురుప్రకాష్, అంజయ్య, రామచంద్రరావు, కళాశాల ప్రిన్సిపాల్ అరుణ, అధ్యాపకులుపాల్గొన్నారు.

ఘనంగా బోనాల వేడుకలు



బోనాల ఊరేగింపులో విద్యార్థులు

చాదర్‌ఘాట్ : దిల్‌సుఖ్‌నగర్‌లోని శ్రీసాయి డిగ్రీ కళాశాలలో బుధవారం బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పోతరాజులుగా, విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో బోనమెత్తుకోగా తోటి విద్యార్థులు స్టెప్పులేస్తూ అమ్మవారి జైజై ధ్వనాల మధ్య బోనాల ఊరేగింపు సాగింది. ప్రిన్సిపాల్ దిలీప్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసచారి, సీనియర్ ఫ్యాకల్టీలు శేఖర్‌రెడ్డి, ఎల్.వెంకటేశ్వర్లు, శోభారాణి, అపర్ణ, మమత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా బోనాలతో కళాశాల నుంచి ప్రారంభమైన ఊరేగింపు భవానీనగర్‌లోని పోచమ్మ ఆలయం వరకు సాగింది.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

చాదర్‌ఘాట్ : యాక్టీవాను ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టడంతో యాక్టీవాపై నుంచి మహిళ కిందపడి అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ కేబీ మురారీ తెలిపిన వివరాల ప్రకారం.. నాంపల్లి రెడ్‌హిల్స్‌లోని సాయి సుధా అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న సిందూ సూర్యాణ్(45) కుమారుడు విశాల్‌తో కలిసి యాక్టీవాపై మలక్‌పేట జడ్జెస్ కాలనీలోని బంధువుల ఇంటికి వెళ్తుంది. మలక్‌పేట నల్గొండ చౌరస్తాలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై నుంచి వెళ్తుండగా ఆర్టీసీ అచ్చంపేట డిపోకు చెందిన బస్సు వేగంగా వెళ్తూ యాక్టీవాను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో యాక్టీవా అదుపు తప్పడంతో వెను క కూర్చున్న సిందూ సూర్యాణ్ కిందపడడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందింది. యాక్టీవా నడుపుతున్న విశాల్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బాతుల చెరువులోకి నీరు వచ్చేదెలా..?

- 7 సెంటీమీటర్ల వర్షం కురిసినా చుక్కనీరు రాలేదు
- చెరువులోకి చేరే ప్రధాన కాలువలు రెండు కబ్జా
- వరదపోయే దారిలేక కాలనీల్లోకి వర్షపునీరు

హయత్‌నగర్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ ప్రాంతంలో తాగు, సాగునీటిని అందించే బాతుల చెరువులోకి వర్షపు నీరు రావడం లేదు. ఇటీవల హయత్‌నగర్‌లో ఏడు సెంటీమీటర్ల వర్షం కురిస్తే ఆ వరద.. కాలనీలను ముంచెత్తిందే కానీ చెరువులోకి చుక్కనీరు చేరలేదు. చెరువులోకి వర్షపునీటిని మోసుకొచ్చే ప్రధాన కాలువలు కబ్జాకు గురయ్యాయి. అయా కాలువలను ఎక్కడికక్కడే పూడ్చేశారు. దీంతో కాలువల్లో పారాల్సిన వర్షపునీరంతా సమీప కాలనీలను ముంచెత్తుతోంది. హయత్‌నగర్ బాతుల చెరువులోకి దాదాపు 5 కిలోమీటర్ల నుంచి వర్షపునీరు చేరేలా నిజాం కాలంలోనే రెండు కాలువలు తవ్వించారు. అందులో ఒకటి రాచ కాలువ, మరొకటి జాల కాలువ. ఇందులో ఓ కాలువ సాహెబ్‌నగర్ పై ప్రాంతాల నుంచి వర్షం నీటిని మోసుకొస్తుండగా.. మరో కాలువ తుర్కయంజాల్ మాసబ్ చెరువు అలుగుపోస్తే వచ్చే నీరుతో పాటు సమీప ప్రాంతాల వర్షపునీటిని బాతుల చెరువులోకి తీసుకోస్తాయి. ఈ రెండు కాలువల ద్వారానే హయత్‌నగర్ బాతుల చెరువు నిండుతుంది. హయత్‌నగర్ చుట్టూ ఏర్పడిన వందల కాలనీలకు భూగర్భ జలాలను అందించేందుకు ఈ చెరువే ప్రధాన ఆధారం. చెరువులో నీళ్లుంటే హయత్‌నగర్ ప్రాంతంలో బోర్లు నీళ్లు పోస్తాయి. చెరువు ఎండిపోయిన సమయంలో ఈ ప్రాంతంలో బోర్లు మొత్తం ఎండిపోతున్నాయి. తీవ్ర నీటి కొరత ఏర్పడుతుంది.

చెరువులోకి చేరే ప్రధాన కాలువలు కబ్జా

బాతుల చెరువులోకి వర్షపునీరు మోసుకొచ్చే నిజాం కాలం నాటి రాచ, జాలు కాలువలు పలు చోట్ల కబ్జాలకు గురయ్యాయి. మరికొన్ని ప్రాంతాల్లో కంపచెట్లు, చెత్తాచెదారంతో కాలువ మొత్తం పూడుకుపోయాయి. ఈ వరద కాలువల గురించి ఎవరు పట్టించుకోకపోవడంతో రియల్ వ్యాపారులు ఇష్టారీతిన కాలువపైనే అక్రమ నిర్మాణాలు చేస్తున్నారు. మరికొందరు కాలువను దర్జాగా పూడ్చి దాని మీదనే రేకుల షెడ్లు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం రెండు కాలువలు అడుగడుగునా కబ్జాకు గురవుతున్నాయి. మూడు రోజుల క్రితం హయత్‌నగర్‌లో సుమారు 7 సెంటీమీటర్ల వర్షం కురిసినా చుక్క నీరు కూడా బాతుల చెరువుకు చేరలేదు. ఇటీవల కురిసిన వర్షానికి కుమ్మరి కుంట నిండి అలుగు ద్వారా కేవలం ఒక్క అడుగు నీరు మాత్రమే బాతుల చెరువుకు చేరింది. కాలువల నుంచి మాత్రం చుక్క నీరు రాలేదు. హైడ్రా అధికారులు బాతుల చెరువుపై ఫోకస్ పెట్టకపోవడంతో రోజు రోజుకు ఆక్రమణలు పెరుగుతున్నాయి.



జాల కాలువ ఆక్రమణకు గురి కావడంతో లోతట్టు కాలనీలు జలమయం



ఆక్రమణకు గురైన రాచ కాలువ



పూడ్చివేసిన జాల కాలువ

త్వరలో సర్వే చేస్తాం

త్వరలో హయత్‌నగర్ బాతుల చెరువుకు సంబంధించిన జాల, రాచ కాలువలను గ్రామ నక్షాలో గుర్తించి సర్వే చేస్తాం. కాలువ కబ్జాపై తమకు ఫిర్యాదులు అందాయి. ఆక్రమణకు పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

- సతీష్, జీహెచ్‌ఎంసీ నార్త్ ట్యాంక్ ఏఈ

కాలువల కబ్జా.. మునుగుతున్న కాలనీలు

బాతులచెరువుకు వరదను మోసుకొచ్చే జాల కాలువను ఆక్రమించి చదును చేయడంతో వరద లోతట్టు ప్రాంతాలకు ప్రవహించి కాలనీలను ముంచేస్తుంది. వాస్తవంగా జాల కాలువ లక్ష్మీప్రియాకాలనీ నుంచి దుర్గానగర్, వెంకటేశ్వరకాలనీ, గరుడానగర్ మీదుగా మునగనూరు రోడ్డు పక్క నుంచి బాతుల చెరువుకు చేరుకుంటుంది. కాలువ మూసుకుపోవడంతో మూడు రోజుల క్రితం కురిసిన వర్షానికి లక్ష్మీప్రియాకాలనీ, బృందావన్‌కాలనీ, స్వగృహ కాలనీలు నీట మునిగాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. జైస్వాల్ ఫర్నిచర్ వెనుక నుంచి బాతుల చెరువు వరకు ఉన్న కాలువ మొత్తం ఆక్రమణలోనికి వెళ్లింది. చెరువుకు చేరాల్సిన నీరు మొత్తం లోతట్టు ప్రాంతాల గుండా పెద్దఅంబర్‌పేట్‌కు చేరుకుంది. ఇన్ఫర్మేషన్ కాలనీలోని రైస్ మిల్లు వెనుక నుంచి ఉన్న రాచకాలువను కొందరు దర్జాగా ఆక్రమించి ఇటీవలే ఇండ్లను నిర్మించారు. ఫిర్యాదు చేసిన లేక్, జీహెచ్‌ఎంసీ, హైడ్రా, ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ఆక్రమణలను తొలగించి కాలువలను పునరుద్ధరించాలని కాలనీల వాసులు కోరతున్నారు.

క్రీడాలో కృత్రిమ మేధస్సుపై వర్క్‌షాప్



కృత్రిమ మేధస్సుపై వర్క్‌షాప్‌లో పాల్గొన్న శాస్త్రవేత్తలు

సంతోష్‌నగర్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): భారతదేశంలో కరువు నిర్వహణ కోసం సుఖరక్షక్ ఏ1(కృత్రిమ మేధస్సు) పై వర్క్‌షాపును ఇంటర్నేషనల్ వాటర్ మెనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, ఏసీఏఆర్ క్రీడా హైదరాబాద్‌లోని ఐసీఏఆర్ సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డ్రైల్యాండ్ అగ్రికల్చర్‌లో నిర్వహించారు. సుఖరక్షక్ ఏ1ని కీలకమైన వాటాదారులకు అందించడం వినియోగదారులు, నిర్ణయాధికారుల నుండి అభిప్రాయాన్ని సేకరించడం, క్షేత్రస్థాయి విస్తరణ, స్కేలింగ్ కోసం సహరూపకల్పన వ్యూహాలను రూపొందించడం ఈ వర్క్‌షాప్ ముఖ్య లక్ష్యమని క్రీడా డైరెక్టర్ వి.కె సింగ్ తెలిపారు. సఖరక్షక్ ఏ1 భారతదేశపు మొట్టమొదటి ముందస్తు ఏ1 ఆధారిత కరువు సలహా వ్యవస్థను క్రీడా సహకారంతో చేసిందన్నారు. నీటి కొరతను పరిష్కరించడం యొక్క ఆవశ్యకతను, కరువు పర్యవేక్షణలో ఏ1 ఏకీకరణ యొక్క ప్రాముఖ్యతను తెలిపారు. పలువురు శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఐడబ్ల్యూఎమ్‌ఐ ఇండియా, బంగ్లాదేశ్ సీనియర్ ఫెలో కంట్రీ రిప్రజెంటేటివ్ అలోక్‌సిక్కా, డాక్టర్ గిరిరాజ్ అమర్‌నాథ్, డాక్టర్, కె.వి రావు, డాక్టర్ సుసమ సుధీశ్రీ, కృషి విజ్ఞాన కేంద్రాల నుంచి వ్యవసాయ విస్తరణ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, ఎన్‌జీఓలు, పరిశోధకులు, వ్యవసాయ నిపుణులతో పాటు వివిధ సంస్థల నుంచి 60మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

వర్షాల వల్ల తలెత్తే సమస్యలను పరిష్కరించాలి

- అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి
- మీర్‌పేట్ ఇన్‌చార్జి కమిషనర్ వాణీరెడ్డి సూచన



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కమిషనర్ వాణీరెడ్డి

సరూర్‌నగర్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో మునిసిపల్ కార్పొరేషన్‌లోని అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, వర్షాల వల్ల తలెత్తే సమస్యలను వెంటనే పరిష్కరించాలని మీర్‌పేట్ ఇన్‌చార్జి కమిషనర్ వాణీరెడ్డి సూచించారు. బుధవారం కౌన్సిల్ హాల్‌లో సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇంజనీరింగ్ అధికారులు రోడ్లు, నాలాలు, భూగర్భ డ్రైనేజీ, మ్యాన్‌హోళ్లపై నిరంతరం పర్యవేక్షణ జరపాలని పేర్కొన్నారు. శానిటేషన్ సిబ్బంది వీధుల్లో చెత్తాచెదారం పేరుకుపోకుండా, నీటినిల్వ లేకుండా చూడాలని సూచించారు. టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు, సిబ్బంది డివిజన్లలోని పురాతన, శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించాలని, అవసరమైతే వాటిని తొలగించడానికి చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. వైద్య సిబ్బంది వర్షాకాలంలో వ్యాపించే సీజనల్ వ్యాధులపై దృష్టిపెట్టాలని, ప్రజల ఆరోగ్యం కాపాడడమే లక్ష్యంగా పనిచేయాలని వాణీరెడ్డి పేర్కొన్నారు. ప్రజలు తమ ఇబ్బందులను మునిసిపల్ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



మాట్లాడుతున్న టీటీఐ ఇన్‌స్పెక్టర్ రాచపుడి

కొత్తపేట, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు భావి పౌరులందరికీ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నామని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ) ఇన్‌స్పెక్టర్ రాచపుడి తెలిపారు. బుధవారం టీటీఐ సిబ్బంది రాచకొండ కమిషనరేట్ పరిధిలోని చంగిచర్లలో రెండు ప్రభుత్వ పాఠశాలల్లో, 7 ప్రైవేటు విద్యాసంస్థల్లో 14 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారన్నారు. విద్యార్థులకు టీటీఐ ఆర్‌ఎస్‌ఐ సంతోష్‌కుమార్, ఏఎస్‌ఐ సోమ్‌నాథ్, సిబ్బంది రమేష్ బృందం కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. 533 మంది విద్యార్థులకు వారు రోడ్డు ప్రమాదాల నివారణలో, ట్రాఫిక్ నిబంధనల ప్రాధాన్యతలపై పలు అంశాలను వివరించారని పేర్కొన్నారు.

మద్యంమత్తులో డ్రైవింగ్ ప్రమాదకరం

మద్యం మత్తులో డ్రైవింగ్ అందరికీ ప్రమాదకరమని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ) ఇన్‌స్పెక్టర్ రాచపుడి సూచించారు. కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ వాహనాల తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన వారిలో 52 మంది మద్యంప్రియులకు 52 మంది కుటుంబ సభ్యుల సమక్షంలో టీటీఐ రాకొండ పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కు లెక్చర్ హాల్‌లో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ ఎస్‌పీఓ అమరవర్ధన్‌రెడ్డి, ఎస్‌ఐ ఎస్‌పీఓ అల్లూరయ్య మద్యంమత్తులో వాహనాలు నడిపితే కలిగే అనర్థాలను వివరించారు.

సాయిఅనిల్ కుటుంబానికి అందెల పరామర్శ

సరూర్‌నగర్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): పెళ్లైన రెండు రోజులకే గుండెపోటుతో మరణించిన బడంగ్‌పేట్‌లోని సాయిఅనిల్ కుటుంబ సభ్యులను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా అనిల్ తండ్రి పుల్లప్ప, తల్లి వరలక్ష్మితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వారికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. రెండు కుటుంబాల్లో విషాదం నింపిన ఈ సంఘటన తనను తీవ్రంగా కలచివేసిందని అందెల పేర్కొన్నారు. పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ముసూనూరి ప్రోలయనాయుడి జయంతి



ప్రోలయనాయుడి చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న సుధీర్ ఫౌండేషన్ నాయకులు

హయత్‌నగర్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): భారతావని సామ్రాట్ ముసూనూరి ప్రోలయనాయుడు 746 జయంతి వేడుకలను బుధవారం హయత్‌నగర్‌లోని రంగనాయకుల గుట్ట వద్ద గల సుధీర్ ఫౌండేషన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ నాయకుడు ఏపూరి గణేష్‌నాయుడు ముసూనూరి ప్రోలయనాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు.

ప్రేమికుడు దుర్భాషలాడాడని యువతి ఆత్మహత్యాయత్నం

వనస్థలిపురం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): కొంతకాలంగా ప్రేమిస్తున్న వ్యక్తి తనపై అనుమానంతో దుర్భాషలాడాడని తీవ్ర మనస్థాపానికి గురైన యువతి ఆత్మహత్యకు యత్నించిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లాకు చెందిన బానోతు అఖిల(24) రసూల్(24) ఇద్దరు కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. కాగా అఖిల వనస్థలిపురం వెంకటరమణ కాలనీలో నివాసముంటున్న తన అక్క బావ వాళ్ల ఇంట్లో ఉంటూ నగరంలోని బొల్లారంలో బీఈడీ విద్యనభ్యసిస్తుంది. రసూల్ ఖమ్మంలో ప్రైవేట్ ఉద్యోగి. కాగా ఈనెల 7న రసూల్ ఖమ్మం నుంచి అఖిల వద్దకు వచ్చి నీవు వేరేవాళ్లతో మాట్లాడుతున్నావని, అఖిలను దుర్భాషలాడాడు. దీంతో ఇరువురి మధ్య తీవ్రవాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన అఖిల ఆటోలో అక్క ఇంటికి వెళ్లింది. వెంటనే తన గదిలో ఉన్న ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. ఈ విషయం గమనించిన అఖిల అక్క వెంటనే తలుపులు పగులగొట్టి అఖిలను బయటకు తీసుకొచ్చి ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పి చికిత్స అందిస్తున్నారు. కాగా అఖిల ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ మేరకు బాధితురాలి కుటుంబ సభ్యులు తన కూతురు అఖిలను రసూల్ ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేయడంతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కూతురును ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేసిన రసూల్‌ను అరెస్ట్‌చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా అఖిల ఆత్మహత్యకు కారణమైనట్లు భావిస్తున్న రసూల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

హర్‌ఘర్ తిరంగా ర్యాలీ



నాగోల్ నుంచి హర్ ఘర్ తిరంగా ర్యాలీని ప్రారంభిస్తున్న బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, రంగారెడ్డి, కార్పొరేటర్లు



నాదర్‌గుల్‌లో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో బీజేపీ నేతలు చంద్రశేఖర్, శ్రీరాములుయాదవ్

సరూర్‌నగర్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్నప్పటి నుంచే దేశభక్తిని అలవరచుకోవాలని బీజేపీ తెలంగాణ సంఘటన మంత్రి చంద్రశేఖర్‌జీ తివారీ, పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ అన్నారు. హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌లో గల ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి త్రివర్ణ పతాకాలను చేతబూని స్కూల్ మైదానంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం వర్షం కురియడంతో కార్యక్రమాన్ని స్కూల్ భవనం సెల్లార్‌లోకి మార్చారు. ఈ సందర్భంగా అతిథులు చంద్రశేఖర్, శ్రీరాములుయాదవ్ మాట్లాడుతూ త్రివర్ణ పతాకం రెపరెపలు ప్రతి భారతీయుడి గుండెను మేల్కొలుపుతాయని అన్నారు. కార్యక్రమంలో డీపీఎస్ సీఈవో మల్కా యశస్వి, ప్రిన్సిపాల్ డాక్టర్ అనుపమాసక్సేనా, తోట శ్రీధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు గూడెపు ఇంద్రసేన, గడ్డం లక్ష్మారెడ్డి, బీజేపీ బడంగ్‌పేట్ శాఖ అధ్యక్షుడు వీరకర్ణారెడ్డి పాల్గొన్నారు.

మన్సూరాబాద్: భారతీయుల ఆత్మగౌరవానికి ప్రతీక మన త్రివర్ణ పతాకం అని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా జిల్లా బీజేవైఎం ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన తిరంగా ర్యాలీని వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి నాగోల్ నుంచి ప్రారంభించారు. ఈ ర్యాలీ వనస్థలిపురంలోని గణపతి కాంప్లెక్స్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా వనిపల్లి మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజల్లో దేశభక్తి భావజాలాన్ని నింపడం, జాతీయ ఐక్యతను బలపర్చేందుకు 'హర్ ఘర్ తిరంగా' చేపట్టామన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, చింతల అరుణాసురేంద్రనాథ్‌యాదవ్, కళ్లెం నవజీవన్‌రెడ్డి, బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, నాయికోటి పవన్‌కుమార్, మొద్దు లచ్చిరెడ్డి, నాయకులు కళ్లెం రవీందర్‌రెడ్డి, కొత్త రవీందర్‌రెడ్డి, వివిధ డివిజన్ల పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

హయత్‌నగర్ : తుర్కయంజాల్ చౌరస్తా నాగార్జునసాగర్ జాతీయ రహదారిపైన బీజేపీ ఆధ్వర్యంలో 79 మీటర్ల జాతీయ జెండాతో తిరంగా ర్యాలీ నిర్వహించారు. బీజేపీ తుర్కయంజాల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు బోసుపల్లి ప్రతాప్, సహకార సంఘం వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, సీనియర్ నాయకులు బచ్చిగళ్ల రమేశ్, వడ్డెపల్లి పాపయ్యగౌడ్, కందాళ భలదేవ్‌రెడ్డి, నర్సింహగౌడ్ పాల్గొన్నారు.

వనస్థలిపురం : ఎందరో అమరవీరుల త్యాగఫలమే దేశ స్వాతంత్ర్యమని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రంగారెడ్డి అర్బన్ జిల్లా యువమోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన తిరంగ బైక్ ర్యాలీ ముగింపు కార్యక్రమం వనస్థలిపురం కాంప్లెక్స్‌లో బుధవారం ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి, చింతల అరుణసురేందర్‌యాదవ్, ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి, పవన్‌కుమార్, నాయకులు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

సంతోష్‌నగర్ : బీజేపీ డివిజన్ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. చంపాపేట వేద డిగ్రీ కాలేజీ నుంచి ప్రారంభమైన తిరంగా ర్యాలీ చంపాపేటచౌరస్తా, గాంధీ విగ్రహం, సుల్తాన్‌అల్వా, మారుతీనగర్, దుర్గభవానీ నగర్‌కాలనీ వరకు విద్యార్థులు భారతమాతకు జేజేలు పలుకుతూ దేశభక్తిని చాటుకున్నారు. కార్యక్రమంలో కాలేజీ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు లింగాల దశరథగౌడ్, గూడూరు అవినాష్‌రెడ్డి, తిరుపతి, యోగిరాజ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చాదర్‌ఘాట్ : బీజేవైఎం భాగ్యనగర్ యూత్ వింగ్ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ ఘనంగా నిర్వహించారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని కమల ఆస్పత్రి నుంచి ప్రారంభమైన తిరంగా ర్యాలీని మూసారాంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి ప్రారంభించారు. కమల ఆస్పత్రి నుంచి ప్రారంభమైన తిరంగా ర్యాలీ మూసారాంబాగ్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీలోని టీ జంక్షన్ వరకు సాగింది. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రకాష్‌రెడ్డి, భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌యాదవ్, మాజీ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్, జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు భరత్, రమేష్‌రెడ్డి, దేవేందర్, దినేష్‌పటేల్ పాల్గొన్నారు.



తిరంగా ర్యాలీలో కార్పొరేటర్ భాగ్యలక్ష్మీరెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రకాష్‌రెడ్డి తదితరులు



తుర్కయంజాల్‌లో తిరంగా ర్యాలీలో విద్యార్థులు, బీజేపీ నాయకులు